# రాజమ్మాళ్

## శివం

ఆవిడపేరు రాజమ్మాళ్! వయస్సు సుమారు నలభయి వుంటాయి. ఎర్రగా వుంటుంది శరీరఛాయ! ఎత్తుకుతగ్గ విగ్రహం. ఎర్రటి శరీరం అవడంవల్ల, చూడటానికి వికారంగా మాత్రం వుండదు. రాజమ్మాళ్ నోరు మహా చెడ్డది.

ఆవిడ ఆ పెద్ద కాంపౌండులోని డాబాలో ఒక భాగంలో వుంటోంది. రెండో భాగం అవినాశలింగం అనే ఒక ప్రొడక్షన్ మేనేజర్‌కు అద్దెకు యిచ్చేసింది. ఆ కాంపౌండ్‌లో వుండే బోట్ హవుస్‌లోని ఆరు భాగాలను కూడా ఆవిడ అద్దెకు యిచ్చేసింది. అందులో ఒక భాగంలో నేను అద్దెకు వున్నాను.

రాజమ్మాళ్ భర్త సినిమారంగంలో మంచి పేరు గడించిన 'కెమేరామేన్'ట! బ్రతికినన్నాళ్ళు శుభ్రంగా సంపాదించేడు, ఖర్చు చేసేసేడుకూడానుట! అయితే ఆయన పోబోయేముందు వున్న ఏకైక కుమార్తెను కోయంబత్తూర్‌లోని ఒక యింజనీర్‌కియిచ్చి పెళ్ళి చేసేసేడు. పోయిన తర్వాత భార్య రాజమ్మాళ్‌కి మిగిలినదల్లా, పెద్దడాబా, కాంపౌండ్‌లోని 'బోట్ హవుస్' మాత్రమే!

ఆ బోట్ హవుస్‌లో వుండేది – నేనుతప్ప మిగతా వాళ్ళంతా సినిమా మనుషులే: చిత్రసీమలో రకరకాల శాఖల్లో పనిచేసేవ్యక్తులు ఆ భాగాల్లో నివసించేవారు. ఒకవాటాలో హాస్యపాత్రలు ధరించే గోపీనాథం, మరో వాటాలో మల్లయుద్ధాలు నేర్పే జోగులు, యింకో వాటాలో ఫొటోగ్రఫీలో తర్ఫీదు పొందుతూన్న రమేశ్‌బాబు, మరో వాటాలో నాట్యాల్లో పాల్గొనే సవితాదేవి, యింకో వాటాలో 'తండ్రి' పాత్రలుధరించే విశ్వేశ్వరావు వున్నారు. నేను ప్రస్తుతంవుంటూన్న వాటాలోకూడా మేకప్‌చేసే రంగయ్య వుండేవాడుట. ఆయన స్వంతచిత్రం ప్రారంభించబోతూ యీవాటా ఖాళీచేసేడుట. ఈ మహానగరంలో కనీసం నెలరోజులైనా ఆఫీసు పనిమీద వుండాలిగనక, అద్దె 50 రూపాయలైనా వెనకాడకుండా ఆ వాటా తీసేసుకున్నాను. (అందరివాటాలూ పాతికరూపాయలేనట!)



ఆఫీసులో రోజుకి రెండు మూడుగంటలే నాకు పని. పని అయిపోగానే, కాంపౌండులోని మామిడిచెట్టు నీడను చాప పరుచుకుని, ఒక దిండు వేసుకుని ఏదో పుస్తకం చదువుతూ సాయంత్రంవరకు పడుకునేవాడిని. ఈలోగా అక్కడవున్న చిత్ర విచిత్రమైన మనుషుల్ని, వాళ్ళ మనస్తత్వాలను ఓ కంట గమనిస్తూ వుండేవాడిని. ఆవాటాల్లో అద్దెకు వున్న సినీజీవుల్లో ప్రతిభకలవాళ్ళు వున్నారు; లేనివాళ్ళు వున్నారు. అనుభవం కలవాళ్ళు వున్నారు; లేనివాళ్ళు వున్నారు. యువకులు వున్నారు. వృద్ధులు వున్నారు. వీళ్ళందరిలోనూ యించుమించు సహజంగా కనపడేవి మాత్రం రెండే రెండు: అంతా బీదవాళ్ళే! అంతా మొండివాళ్ళే!

ఇంచుమించు అన్ని వాటాలలోవాళ్ళూ ఉదయం తొమ్మిది కాకముందే, దుస్తులు వేసుకుని బయటికి ఎక్కడికో వెళ్ళిపోయే వాళ్ళు. తర్వాత ఒకరొకరుగా రెండుగంటల కల్లా వాటాలలోకి చేరేవాళ్ళు. మళ్ళీ నాలుగు దాటేక, ఒక్కరొక్కరే కాంపౌండులో తచ్చాడుతూ కాలుకాలిన పిల్లిలా తిరుగుతూ వుండేవాళ్ళు – టెలిఫోన్ పిలుపుకోసం!

రాజమ్మాళ్ యింట్లోవుంది ఆ టెలిఫోన్! ఆ టెలిఫోన్ లోపలిగదిలో వుంది. అయితే దాని ధ్వని కాంపౌండులో వాళ్ళందరికీ పరిచితమే. వాళ్ళు ఎక్కడవున్నా, ఏంచేస్తున్నా, ఆ చేసేపనిని ఆపేసి ఎక్కడివాళ్ళక్కడ చెవులు రిక్కించుకుని ఆగిపోతారు. 'టర్–ర్–ర్...' అని మరోసారి టెలిఫోన్ మోగుతుంది. అప్పటికిగాని రాజమ్మాళ్

కదిలి టెలిఫోన్‌వైపు నడవదు. నడిచి, నెమ్మదిగా టెలిఫోన్‌ను ఎత్తి, విసుగ్గా మాట్లాడి, అద్దెకువుండే వాళ్ళకి వచ్చిన పిలుపు అయితే అక్కడినుంచే, 'విశ్వేశ్వ రావుగారూ!' అని అరుస్తుంది. ఆ పిలుపు వచ్చిన ఆయన ప్రాణాలు లేచివచ్చి, 'వచ్చే వచ్చే' అంటూ యింట్లోకి పరుగెత్తుకుని వస్తాడు. మిగతావాళ్ళుమాత్రం చిన్న నిట్టూర్పు విడుస్తారు.

ఆ ఇంటికి ఆ టెలిఫోన్ వుండడం పెద్ద వరప్రసాదం. ఈ కాంపౌండులో వుండే సినిమా జీవులంతా నగరంలోనివాళ్ళకి ఆ టెలిఫోన్ నెంబరు యిచ్చేసి, అందులో ఎప్పుడు పిలుపు వస్తుందా అని ఎదురు చూస్తూవుంటారు. ప్రొద్దునేవెళ్ళి నలుగురినీ చూసి, టెలిఫోన్ నంబరు యిచ్చేసిరావడం, మధ్యాహ్నంనుంచి టెలిఫోన్ పిలుపుకోసం ఆశతో ఎదురుచూడటం! అట్లా నెలలు, సంవత్సరాలు, ఆశతో ఎదురుచూస్తూ వున్న వాళ్ళు ఆ కాంపౌండులో అనేకమంది.

టెలిఫోన్ మోగినప్పుడు నేను వులిక్కి పడవలసిన అవసరం ఏమాత్రం లేదు. కాని అది మోగినప్పుడల్లా నేనూ వాళ్ళతోబాటు వాళ్ళకోసం ఆశాసౌధాల్ని కడుతూవుండే వాడిని: 'పాపం! ఈసారి ఆ నాట్యకత్తెకి పిలుపువస్తే బావుండును.' 'ఈసారైనా ఆ తండ్రి వేషాలు వేసే అతనికి పిలుపు రాకూడదూ!' అని అనుకుంటూ వుండేవా డిని. అక్కడున్నవాళ్ళంతా ఎంతో మంచి వాళ్ళు. అందుచేత వాళ్ళందరికోసంకూడా వూహాసౌధాల్ని వూహించుకుంటూ వుండే వాడిని.

అయితే ఒక్కసంగతిచెప్పాలి. అక్కడ వున్న వాళ్ళందరిలోకి గోపీనాథం అంటే నాకు యిష్టం ఎక్కువ. ఇదివరకు నేను ఆయన వేసిన చిత్రాలన్నీ చూసేను. ఇంచు మించు అన్నీ శతదినోత్సవాలు చేసుకు న్నాయి ఆరోజుల్లో. ఆయన పేరుచెబితే జనం వెర్రెత్తిపోయేవాళ్ళు. కమెడియన్ గోపీనాథం అంటే అంత పేరుండేది ఆ రోజుల్లో.

అతని అసలుపేరు గోపాల్రావు. సినిమా వాళ్ళు గోపీనాథం అని మార్చివేసేరుట! బి. ఎ. చదువుతూ చదువుతూ చిత్రసీమలో అవకాశం వచ్చిందికదా అని, విద్యకి ఉద్వా సనచెప్పి చిత్రసీమలో కాలు పెట్టేడుట... అయిదేళ్ళు ఏకచ్ఛత్రాధిపత్యంగా హాస్య పాత్రలు ధరించేడుట. 'ఒద్దు మొర్రో' అంటున్నా, బలవంతంచేసి 30 వేల వరకు యిచ్చి కాంట్రాక్టు సంతకం చేయించేవారుట. దేశంలో క్షామదేవత నృత్యం చేస్తోందని, విరాళాలకోసం ఒక నాటక కంపెనీతో దేశా టనంచేసి, విరాళాలు లక్షలకు లక్షలు పోగు చేసి రెండేళ్ళపాటు ప్రభుత్వానికి అందచేసే డుట! తిరిగి వచ్చేసరికి సినిమావాళ్ళంతా ఆయనను మరచిపోయేరుట. లక్షలకు లక్షలు తనవల్ల చేసుకున్న ప్రొడ్యూసర్లే అతనిని మరచిపోయేరుట. ఈలోగా కొత్త కొత్త హాస్య పాత్రధారులు అనేకమంది అవత రించేరుట! మూడేళ్ళనుంచి, అభిమానం వదులుకుని అడిగినా, చిన్న వేషంకూడా యిచ్చిన వాడు లేడుట!

గోపీనాథం గాధ విన్నాక ఆయనమీద నాకు మరీ అభిమానం పుట్టుకొచ్చింది. గోపీ నాథానికి పని వుండేదికాదు; నాకూ పని వుండేదికాదు గనక, యిద్దరం కాస్సేపు చీట్లాటనో, చదరంగమో రోజూ ఆడుతూ వుండేవాళ్ళం. మేము ఆడుకుంటూ వుండగా టెలిఫోన్ మోత విన్పించేది. ఇద్దరిలో ఎవరమూ ఆదుర్దా పడేవాళ్ళంకాము. నేను మాత్రం విచిత్రంగా ఆయన మొహంలోకి చూసేవాడిని, ఎక్కడైనా ఆశారేఖ ద్యోతక మవుతుందేమోనని... ఉహు. ఆయన నవ్వుతూ 'మీరే ఆడాలి,' అంటూ గట్టిగా సిగరట్ దమ్ము లాగేవాడు.

ఒకనాడు వుండబట్టలేక రాజమ్మాళ్‌తో అనేసేను — "పాపం! జనంకూడా మరచి పోతున్నారు ఆయన్ని! ఒక్కచిన్నవేషం — ఎంత చిన్నదైనా సరే — ఆయనకు దొరికితే ఎంత బాగుండును!"

"కొంచెం మందారమొక్కని పట్టుకుం టారా! దీన్ని మొదట్లో తాడేసి కట్టేస్తాను. కొమ్మలన్నీ తోవలోకి వచ్చేస్తున్నాయి." అన్నది ఆవిడ నా మాటలు విననట్లు.

సాయంకాలమప్పుడు ఆవిడ దొడ్లో మొక్కలసంగతి చూస్తూ వుంటుంది. గత నాలుగైదు రోజుల్నుంచి ఏమీ తోచక నేను ఎక్కడికీ బయటకు వెళ్ళడంలేదు... వీలయినప్పుడల్లా మొక్కల విషయంలో రాజమ్మాళ్‌కు సాయంచేస్తూ, సలహాల నిస్తు న్నాను. అదీగాక అందరికంటె ఎక్కువ నేను అద్దె యిస్తున్నాను గనక, కొంచెం చనువుగా మాట్లాడసాగేను.

ఆవిడ చెప్పినట్లే మందార మొక్కని పట్టుకున్నా గట్టిగా. ఆవిడ కొమ్మలకు తాడు వేసి బిగించి కడుతూండగా, మళ్ళాఅన్నాను, "మూడేళ్ళనుంచి వేషం లేదుట, ఎంత అన్యాయమో చూడండి! ఇన్నాళ్ళూ వేషా లకు అలవాటుపడిన పెద్దమనిషి, యిప్పుడు వేరే ఏ వుద్యోగంచేసి బతకగలడు చెప్పండి."

గోపీనాథం దూరంగా కొబ్బరిచెట్టుదగ్గర యింటివాళ్ళ కుక్కను గోకుతూ కూర్చుని వున్నాడు. రాజమ్మాళ్ తాడు కట్టడం పూర్తిచేసి, "గోపీనాథమేనా? ఆయన పెద్ద మనిషి! అట్లాంటి పెద్దమనిషి యీ వాటా ల్లోకి ఎప్పుడూ రాలేదు... యిప్పటివరకు" అన్నది.

నేను ఆశ్చర్యపోయేను ఆవిడ సూక్ష్మ బుద్ధికి.

"అంతేకాదు! ఇక్కడ వుండేవాళ్ళంతా వట్టి మోసగాళ్ళు. దగాకోర్లు. అల్లరిమూక" అన్నది రాజమ్మాళ్.

"ఏమిటీ! నిజమే!" అన్నాను, నన్ను కూడా జమచేసి మాట్లాడిందేమోనని.

"అవును. ఆ అవినాశలింగాన్ని చూడండి. అతనికేం రోగం? పగలుకూడా బయటికి వెళ్ళేటప్పుడు, యింట్లో ఎలెక్ట్రి

లైట్లు వేసి పోతాడు. పట్టి కుళ్ళుబోతు మనిషి'' అంది రొప్పుతూ.

"పైకి పెద్దమనిషిలాగ కన్పిస్తాడు! అతనికి అదేం జబ్బండీ?'' అన్నాను సాను భూతి ఒలకబోస్తూ.

"ఏం చెబుతాం! ఒకోళ్ళకి ఒకో జబ్బు! అతను ఆరేళ్ళక్రితం, యింకో మనిషితో కలిసి 50 రూపాయల అద్దెకి డాబా వాటాలో ప్రవేశించేడు. సంవత్సరం క్రితం తనతో కలిసివుండే మిత్రుడు వెళ్ళిపోయేట్ట. అప్పటి నుంచీ వాటా ముప్ఫయికి తగ్గించమంటాడు. ఖాళీ చెయ్యమంటే చెయ్యడు. ఇది న్యాయ మేనా? నేను ఆడదాన్ని అనేకదా నన్నిట్లా ఏడ్పించడం?'' అన్నది రాజమ్మాళ్ ఆవే శంతో.

''ఎంత దుర్మార్గం!'' అన్నాను నిజం గానే, కొంచెం బాధపడి.

''పైగా నన్ను 'కాబూలీదెయ్యం' అనీ యింకేమేమొ అనరాని మాటలు అన్నాడు. నేను వూరుకుంటానా – 'పీనాసి గాడిదా, దొంగమొహమా' అని నాలుగు మాటలూ అనేసేను. మాటలుఅన్నా పడ్డాడుగాని, ఖాళీ చేసేడుకాడు. ఏం... నేను అన్న మాటల్లో తప్పేమైనా వుందా? చెప్పండి... అతనుచేసినపని... పగలు లైట్లువేసి నన్ను ఏడ్పించడం సబబేనా?''

"మంచిపనే చేసేరు. అయితే యీ అవి నాశలింగంగారిదే కదూ "ఆకాశ పిక్చర్స్!" అన్నాను.

"పీనాసిమొహం సినిమాకూడా తియ్యాలి! అతని స్నేహితులు తీస్తున్నారుట. ఇతనికి అందులో పలుకుబడి వుంది'' అంది.

"మన గోపీనాధాన్ని గురించి అతనితో ఎవరైనా ఒకమాట పడేస్తే బాగుండును. ఎంతచిన్న వేషమైనా ఫర్వాలేదు –''

"నేనిప్పుడేకదా చెప్పేను – ఆ మనిషి స్వభావంగురించి!'' అన్నది రాజమ్మాళ్ అడ్డం వచ్చి.

"అవుననుకోండి. పగలల్లా లైట్లు వేస్తాడు!'' అన్నాను.



"రాత్రయితే అనుకోవచ్చు. పగలు లైట్లువేసే కుళ్ళుమనిషి అతనిని గురించి ఏమనుకోవాలో మీరే ఆలోచించండి'' అంది మళ్ళా మండిపడుతూ! నిప్పులుగ్రక్కే అవిడ రూక్షణ వీక్షణాలు చూసి, మరి మాట్లాడలేక, నా వాటాలోకి పరుగెత్తేను.

ఒకవారం తర్వాత కాబోలును, రాజ మ్మాళ్ సలహావినకుండా, అవినాశలింగంతో గోపీనాధాన్ని గురించి ప్రస్తావించేను.

ఆనాడు మేము యిద్దరమూ అనుకో కుండా ఒక కొత్త హోటల్లో తటస్థపడ్డాము. కాకతాళీయంగా అవినాశలింగం ప్రక్కనే స్థలం ఖాళీగా వుంది.

కూర్చున్నాక టిఫిన్ 'ఆర్డరు' చేసి, అవి నాశలింగం వైపు తిరిగి, "ఇవ్వేళ చాలా చల్లగావుంది" అన్నాను, ఏదో మాటలు కలపాలనే తాపత్రయంతో.

"ఇక్కడ ఎప్పుడూ చల్లగానే వుంటుంది" అన్నాడు నవ్వుతూ.

''ఈ నగరంలో మనుషులుకూడా ఎంతో మంచివాళ్ళండి!" అన్నాను.

"మంచివాళ్ళే యిక్కడ మిగిలిపోతారు. చెడ్డవాళ్లు పారిపోవలసిందే," అన్నాడు విరగబడి నవ్వుతూ.

"అయితే మన యింటి ఓనర్ – రాజ మ్మాళ్ కూడా మంచిదేనా?" అన్నాను.

"ఓ...అదా! అది డిక్టేటర్... ఆడ నెపోలియన్," అంటూ మళ్లీ తన జోక్‌కి తనే నవ్వేడు.

నేను ఒక చిర్నవ్వు వదిలేను, అంగీకార సూచకంగా.

అతను 'బిల్లు' తీసుకుని లేవబోతూ, "మీరీ వూళ్ళో వున్నన్నాళ్లూ ఏ సాయం కావలసినా అడగండి...తప్పక చేస్తాను. మనిద్దరం ఎక్కువగా కల్సుకునే అవకాశం వుండదు... నాకు వల్లమాలిన పనులు... చచ్చేందుకుకూడా తీరికవుండదు...ముందు ముందు మరీను... ఓ...కే?" అన్నాడు.

"థాంక్యూ! మన కాంపౌండ్‌లో గోపీనాథం వున్నాడు చూసేరూ...పాపం చాలా అవస్థపడ్తున్నాడు......బోలెడు పెర్సనాల్టీ వుంది...నటనా సామర్థ్యం వుంది......అయినా పైకి రాలేకపోతున్నాడు. మీరో వేషం గనక..." అన్నాను ధైర్యంచేసి.

"ఏం? మీ కేమైనా కమీషన్ ఇస్తానన్నాడా వేషం యిప్పిస్తే!" అన్నాడు.

"అబ్బెబ్బే అదేంకాదు...పాపం అవస్థపడుతున్నాడు" అన్నాను, కోపాన్ని అణుచుకుని.

"ఆ గోపీనాథంగాడు ఒట్టి తలతిరుగుడు మనిషి. అటువంటివాడు వుండటంకంటె... వస్తా," అంటూ వెళ్ళిపోయేడు అవినాశలింగం.

అతను వెళ్ళిపోయేడు గనుక బతికిపోయేడేమో, ఉంటే పాతేసివుందును అన్పించింది. కోపంతో నా ఒళ్ళు నఖశిఖపర్యంతం వణకసాగింది. 'ఎంత మాట అన్నాడు రాస్కెల్' అని గొణుక్కున్నాను.

ఆ మర్నాడు రాజమ్మాళ్, నేనూ దొడ్లో పెరిగిన పిచ్చిమొక్కల్ని ఏరివేస్తూవుండగా, గోపీనాథం ఏదో ఖాళీపొట్లాన్ని కాంపౌండ్ చివర పారేస్తూ వుండటం గమనించేను.

"ఈపూటకూడా భోజనం చేసినట్లులేదు పాపం! ఏ పకోడీలో తిని గడిపేస్తున్నట్లున్నాడు" అన్నాను.

రాజమ్మాళ్ తలెత్తి గోపీనాథాన్ని చూసిందిగాని, ఏమీ అనలేదు. నాకు లోపలనుంచి అందరిపైనా కోపం, అసహ్యం తన్నుకుని వస్తున్నాయి. ఇంతలో గోపీనాథం నెమ్మదిగా మా వైపు వచ్చి, "ఏం చేస్తున్నారు?" అన్నాడు అమాయకంగా.

"పనికిరాని మొక్కల్ని పీకివేస్తున్నాం. సాయం చేస్తావా?" అన్నాను.

"అంతకంటె మంచి పని ఏముంది? కానియ్యి," అంటూ అతనూ మాలో కలిసిపోయేడు.

ఆ మర్నాడు అనుకుంటాను. అతనో మార్వాడి తాకట్టు షాపులోంచి బయటికి వస్తూ అవుపించేడు. నన్ను చూడగానే కుడిచేతిని పేంట్ జేబులో పెట్టుకుని "హల్లో" అన్నాడు.

నేనూ "హల్లో" అన్నాను. ఆ పూట బలవంతంచేసి అతనిని నాతో భోజనానికి మంచి హోటలుకి తీసుకెళ్ళేను. భోజనం చేస్తూండగా, అతని కుడిచేతి వేలికుండే బంగారపు టుంగరం లేకుండా వుండటం గమనించేను. అది గమనించి, చిర్నవ్వుతో, "ఆ విషయం ఎత్తకండి," అన్నాడు గోపీనాథం. నేను మరి మాట్లాడలేకపోయేనుకూడాను.

ఆనాడు వెన్నెలగావుంది. ఇంకో రెండు రోజుల్లో నేను ఆ నగరంనుంచి మకాం ఎత్తివేయాల్సి వున్నందున స్టేషన్‌కి వెళ్ళి 'బర్తు' ఒకటి రిజర్వ్ చేయించుకుని, వచ్చేటప్పుడు ఒక హోటల్లో చపాతీలు పొట్లాం కట్టించుకుని మరీ యింటికి వెళ్ళేను.

గోపీనాథం యింట్లోనే వున్నాడు. బలవంతాన నేను తెచ్చిన చపాతీలు కొన్ని అతనిచేత తినిపించి, రెండేసి గ్లాసుల మంచినీళ్ళు తాగి యిద్దరం నా వాటాలో పేకాటకి వుపక్రమించేం. అప్పటికి తొమ్మిదిన్నర అవుతుందేమొ! రాజమ్మాళ్ నా వాటా ముందునుంచే వెళుతూ "రాత్రల్లా ఆడితే లాభం లేదు. పదింటికల్లా ఆర్పెయ్యాలి లైట్లు" అంది మేఘ గంభీర స్వరంతో.

"నిజంగా! ఆడ నెపోలియనే నండి," అన్నాను ఆవిడ అవతలకు వెళ్ళగానే.

"నాకు యివ్వేళ ఆడాలని ఏమాత్రం లేదు. నా మనస్సంతా యింటివైపు పోతోంది. వాళ్ళెట్లా వున్నారో...ఏమో..." అన్నాడు గోపీనాథం!

నేను దిగాలుగా పేకముక్కల్ని పెట్లో పెట్టేసేను. ఆయన శూన్యంలోకి చూస్తూ కూర్చున్నాడు. ఆయనని ఎట్లా ఓదార్చాలో తోచక, పొద్దున కొన్న పేపరు తెరిచేను వార్తలు చూద్దామని.

ఇంతలో టెలిఫోన్ మోత విన్పించింది. అన్ని వాటాలలోనూ ఆకస్మికంగా సద్దుమణిగిపోయింది. పేపరు అక్కడే పడేసి సిగరెట్లు తెచ్చుకుందామని వాటాలోంచి బయటికి వచ్చేను. కాంపౌండులో అయిదారుగురు నిశ్చలంగా నిలబడి వున్నారు. టెలిఫోన్ యింకా టర్...ర్...ర్...మంటూనే వుంది. 'అందరి మనస్సులు పాపం ఆశలతో వూగుతున్నాయి–యీ రాజమ్మాళ్ ఎక్కడో?' అనుకున్నాను కోపంతో!

ఇంతలో టెలిఫోన్ ఆగిపోయింది. రాజమ్మాళ్ మాట్లాడుతోంది. "ఊఁ! ఇక్కడే వున్నాడు...పిలవమంటారా...తప్పుతుందా ...పిలుస్తా వుండండి."

'ఎవడో ఆ అదృష్టవంతుడు' అనుకుంటూ నడుస్తున్నాను బయటకు.

"గోపీనాథం ... గోపీనాథం ... ఫోను వచ్చింది రావయ్యా!" అని కేక వేసింది రాజమ్మాళ్!

"ఏమిటీ? గోపీనాథానికి ఫోనా?" అనుకుంటూ ఆగిపోయి, వెంటనే వెనక్కి పరుగెత్తుకొచ్చి, "గోపీనాథం! లే! లే! నీకు ఫోన్ వచ్చింది. ఊఁ" అని గోపీనాథాన్ని తొందరచేసి, ఫోన్‌వద్దకు తోలేను.

రాజమ్మాళ్ మెరిసే కళ్ళద్దాలతో గుమ్మం దగ్గరే నిలబడి, ఎక్కడో శూన్యంలోకి చూస్తోంది.

"ఆఁ! నేనే! గోపీనాథాన్ని ...ఆకాశ్ పిక్చర్సా?...ఆఁ! పెద్దవేషమైనా ఫర్వాలేదు, చిన్నదైనా ఫర్వాలేదు. శక్తివంచన లేకుండా నటిస్తాను. ముఖ్యమైన వేషమా ... చాలా థాంక్సండి. అట్లాగే! రేపు పొద్దున్నే ఆఫీసుకి వచ్చి కంట్రాక్టు సంతకం చేస్తా. థాంక్స్. వుంటామరి."

నేను రాజమ్మాళ్ వైపు వింతగా చూసేను. కాని రాజమ్మాళ్ ఎక్కడో చూస్తోంది, మెరిసే కళ్ళద్దాలతో! గుమ్మంలోనే గోపీనాథంతో కరచాలనం చేస్తూ, "చాలా బాగుంది. గుడ్‌లక్," అన్నాను.

"మీ అందరి ఆశీర్వచనమూ! రాజమ్మాళ్‌గారూ! నాకో ముఖ్యమైన వేషం ఆకాశ్ పిక్చర్స్ వాళ్ళ చిత్రంలో వుందట!

వచ్చి రేపు కంట్రాక్టు సంతకం చెయ్య మన్నారు. ఇందులో గనక నేను రాణిస్తే..."

"ఎందుకు రాణించవు బాబూ! రాణిస్తారు గనకే వేషం యిస్తున్నారు," అంది రాజమ్మాళ్ సంతోషంతో.

కాంపౌండ్‌లోని మిత్రులందరికీ యీ శుభ వార్త చెప్పడానికి గోపీనాధం వెళ్లేడు.

నేను ఒక్క క్షణం నిశ్చేష్టుడినై, తర్వాత తేరుకుని, నెమ్మదిగా, రాజమ్మాళ్‌తో అన్నాను, "ఆకాశ్ పిక్చర్స్ అంటే ఆ అవినాశలింగం స్నేహితులదేనా ?"

రాజమ్మాళ్ తిరిగి ఎక్కడో చూస్తూ, మౌనంగా తలవూపింది.

"అయితే ... అయితే వాడుపెట్టిన షరతులకు అంగీకరించే రన్నమాట ?..."

రాజమ్మాళ్ నావైపు కూడా తిరిగి చూడ లేదు. ఆమె మొహం చాలా సీరియస్‌గా వుంది. కళ్ళజోడు అద్దాలపైన లైటువెలుగు పడి మెరుస్తూవుండటంవల్ల ఆమె కళ్ళు ఏమంటున్నాయో కూడా అర్థం కావడంలేదు.

ఆ అవినాశలింగం అడిగినట్లు అద్దె తగ్గించి, వాటా వాడికిందే వుంచేందుకు అంగీకరించేరన్నమాటేగదూ," అన్నాను ఆశ్చర్యంతో.

నెలకు ఇరవయిరూపాయల చొప్పున సంవత్సరానికి రెండువందల నలభయి. అందులో యింటి అద్దెలపైన బతకాల్సిన రాజమ్మాళ్ - యింత త్యాగమా ?




నేను వెంటనే వంగి ఆమె పాదాలను స్పృశించబోయేను.

"ఏమిటా పని గోపాలంగారూ! తప్పు... తప్పు..." రుద్ధస్వరంతో అంటూ త్వరితంగా పాదాలను వెనక్కు లాక్కుని, ఎడంగా జరిగింది రాజమ్మాళ్.

"రేపు మీ అందరికీ టీ పార్టీ !" అంటూ వస్తూన్న గోపీనాధం గొంతు దూరంనుంచి విన్పిస్తోంది.

"ఈ సంగతి గోపీనాధానికి తెలియనివ్వకండి" అని నెమ్మదిగా అని, వెంటనే "పొద్దున్న బాత్‌రూంలో లైటువేసి మరచిపోయింది మీరేనా ? ఇట్లా అయితే ఆడదాన్ని నేను బతికేదెట్లా గోపాలంగారూ ?" అంది గట్టిగా, కంఠంలోకి కర్కశత్వాన్ని తెచ్చిపెట్టుకుని.

గోపీనాధం దగ్గరగా వస్తూండటం గమనించి, "పొరబాటయిపోయింది, క్షమించండి. ఇంకెప్పుడూ యీ విషయం మరచిపోను" అన్నాను.

"ఊం! పదయింది. లైట్లు ఆర్పేసి పడుకోండిక. లైట్లు మాత్రం వూరికే తగలేస్తే-ఎవరైనా సరే - వూరుకునేది లేదిక" అంటూ రాజమ్మాళ్ లోపలికి వెళ్ళిపోయి ధడాలున తలుపులు వేసుకుంది.

"ఒత్తి ఆడనెపోలియండీ!" అన్నాను నెమ్మదిగా గోపీనాధంతో.

సమాధానంగా గోపీనాధం, యిన్నాళ్ళకి మనసారా నవ్వడం విన్నాను. ★

## నిగ్రహం

ఓ అందమైన అమ్మాయి. ఆ అమ్మాయి రోడ్డువెంట పోతుంటే అందరూ చూసేవారే. కాని ఒక్కడుమాత్రమే ఆ అమ్మాయిని చూడకుండా దాటి వెళ్ళిపోతున్నాడు. చాలాకాలం అతన్ని గమనించిన ఆ అమ్మాయి ఓరోజు మెల్లగా పిలిచి అడిగింది.

'ఏమండీ ! ఇంతమంది మగవాళ్ళల్లోనూ మీ రొక్కరే ఆడదానివైపు కన్నెత్తిచూడకుండా వెళ్ళగలిగినవారు. మీ నిగ్రహం నాకు నచ్చింది. మిమ్మల్ని పెళ్ళిచేసుకోవా లనుకుంటున్నాను. మీరేమంటారు ?'

నిజాన్ని కుండ బద్దలు కొట్టినట్లుగా చెప్పేశాడతను.

'అందరికీ వున్న నిగ్రహం నాలో లేనందువల్లనే ఎవరినీ చూడకుండా అలా తప్పించుకు తిరుగుతుంటాను. ఇక మీ ఇష్టం.'

అన్నాడోలేదో ఆ అందమైన అమ్మాయి ఒక్కటేపరుగు.